www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 30 ఏప్రిల్ 2023

5

పశ్చిమ గోదావరి

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి : ఆర్‌డిఒ రాజు

ఉండి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. మండలంలోని వెలివర్రు గ్రామ పరిధిలో ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామంలో జగనన్న కాలనీలో పూడిక పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మట్టిపూడిక పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మట్టిపూడిక జరిగిన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణానికి పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ జి.పిచ్చియ్య, ఇఇ బివి.రమణ, డిఇ పి.శివరామరాజు, ఎఇ రామకృష్ణంరాజు, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు, ఆర్‌ఐ రేవు కార్తీక్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

డబ్బులిస్తేనే లారీలు..!

- ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లా అధికారులు విఫలం
- లారీలు లేక కళ్లాల్లోనే ధాన్యపు రాశులు
- అకాల వర్షంతో తడిసి ముద్దయిన ధాన్యం
- డబ్బులిస్తేనే లారీలు పంపుతామంటున్న కేంద్రాల నిర్వాహకులు
- టార్గెట్ పూర్తయిందంటూ సంచులు ఇవ్వని దుస్థితి
- చిరిగిన సంచులతో రైతుల అవస్థలు

దెందులూరు మండలం నారాయణపురంలో హడావుడిగా ధాన్యం మాసూళ్లు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నా పేరు కూనా ముకుందరావు, కొవ్వలి గ్రామం. ఎకరం భూమిలో ధాన్యం మాసూలు చేసి బస్తాల్లో నింపి కొవ్వలి సొసైటీ వద్దకు చేర్చాం. ఇప్పటికీ నాలుగు రోజులైంది. లారీలు రావడం లేదని ధాన్యం ఎత్త లేదు. వర్షాలకు నానా యాతన పడుతున్నాం. ముందుగా లారీ కిరాయి నిమిత్తం రూ.2,100 ఇస్తేనే ధాన్యం తీసుకెళ్తామంటూ కొనుగోలు కేంద్రాల్లో పని చేసే సిబ్బంది చెబుతున్నారు. ఇదేం దారుణమో అర్థం కావడం లేదు'.

'కొవ్వలి గ్రామానికి చెందిన పొన్నాడ పారినాయుడు 16 ఎకరాల్లో వరి సాగు చేశారు. సంచుల్లో ధాన్యం పట్టి 250 సారులు ఉన్నాయి. లారీలు రావడం లేదని ధాన్యం తీసుకెళ్లలేదు. ముందుగా టన్నుకు రూ.350 చొప్పున కిరాయి డబ్బులిస్తేనే లారీలు పెడతామంటున్న పరిస్థితి ఉంది. ఇంకా ఐదెకరాల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. శనివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. గ్రామంలో పండిన పంటలో 50 శాతం ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. ఇచ్చిన సంచుల్లో సగం చిరిగిపోయి ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.'

పైన పేర్కొన్న రైతులు ముకుందరావు, పారినాయుడే కాదు. ఏలూరు జిల్లాలోని వేలాది మంది రైతుల పరిస్థితి ఇదే. ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లా పౌరసరఫరాల శాఖ పూర్తిగా విఫలం కావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. లారీలు సకాలంలో పంపడంలో అధికారులు పూర్తిగా చేతులెత్తేశారు. దీంతో ముందుగా డబ్బులిస్తే లారీలు పెడతామని కొనుగోలు కేంద్రాల్లో పని చేసే సిబ్బంది చెప్పడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా రబీలో 79 వేల ఎకరాల్లో వరిసాగు సాగింది. 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దీనిలో రెండు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని టార్గెట్ నిర్ణయించారు. ధాన్యం కొనుగోలు ప్రారంభం నుంచి అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. లారీలు లేక కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో అకాల వర్షాలతో రైతులు విలవిల్లాడుతున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయపోవడంతో పండించిన పంట కళ్లాల్లోనే దర్శనమిస్తోంది. మాసూలు చేసిన ధాన్యంలో 50 శాతం పంట ఇప్పటికీ కళ్లాల్లోనే ఉండిపోయింది. శనివారం వచ్చి పడిన అకాల వర్షంతో దెందులూరు వంటి మండలాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులకు ఏంచేయాలో తెలియని దుస్థితి నెలకొంది. పంటను తరలించేందుకు లారీల ఏర్పాటులో జిల్లా అధికార యంత్రాంగం చేతులెత్తేయడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ముందుస్తుగా రైతులు డబ్బులిస్తే మాత్రం లారీలు వెంటనే వచ్చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో లారీ కిరాయి నిమిత్తం రైతులకు రూ.13 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖర్చవుతోంది. లారీలు సమకూర్చాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు. వచ్చిన ఒకటి, రెండు లారీలు కూడా అధికార పార్టీ అండ ఉన్నవారికే వెళ్లిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. లారీలకు ముందుస్తుగా డబ్బు కట్టడం ఏమిటో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. ఖరీఫ్‌లోనూ ఏలూరు జిల్లావ్యాప్తంగా రైతులు ధాన్యం విక్రయించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. రబీలోనూ అదే పరిస్థితి నెలకొంది.

సంచులేవీ..

పండిన పంటలో సగం ధాన్యం కొనుగోలు చేయాలని మాత్రమే టార్గెట్ నిర్ణయించారు. పలు కొనుగోలు కేంద్రాల్లో టార్గెట్ పూర్తయిపోయింది. దీంతో సంచులు నిలిపివేశారు. ఇంకా ఆ కొనుగోలు కేంద్రం పరిధిలో సగం ధాన్యం ఉండిపోయింది. సంచులకై రైతులు నానాఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన సంచుల్లో సగం చిరిగిపోయి ఉండటంతో ధాన్యం పట్టేందుకు నానావస్థలు పడుతున్నారు. పండిన పంటను వర్షాల బారి నుంచి కాపాడుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు అనుభవిస్తున్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీల ఏర్పాటులో అధికారులు ఎందుకు విఫలమవుతున్నారో ఎవ్వరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది.

1153 రకం ధాన్యం కొనాలంటూ రాస్తారోకో

జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు

ప్రజాశక్తి - వీరవాసరం

1153, 1156 రకాల ధాన్యం కొనుగోలుపై మిల్లుల వద్ద రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, ఆ రకాల ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని కోరుతూ స్థానిక తూర్పు చెరువు సెంటర్ వద్ద జాతీయ రహదారిపై టిడిపి ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విధానంపై రైతుల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. 1153, 1156 రకాలు ముక్కవుతున్నా తెలిసి కూడా ఈ ప్రభుత్వం ఆ రకాలను దాళ్వా సాగుకు ఎలా అనుమతిచ్చిందని ప్రశ్నించారు. ఈ రకాలపై రైతులు మక్కువ చూపుతున్నారని తెలిసి కూడా ఆ విత్తనాల అమ్మకాలను ఆపడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతుల ఆందోళన విషయం ఎస్ఐ రమేష్, తహశీల్దార్ సుందర్రాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహశీల్దార్ రైతులతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల వద్ద నుండి డబ్బు వసూలు చేయరని ఆయన హామీ ఇచ్చారు. మిగిలిన రైతు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మిల్లర్ల వద్ద ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, రాయపనేని వెంకట్, వీరవల్లి చంద్రశేఖర్, వీరవల్లి శ్రీనివాసరావు, చింతా కనకయ్య, రెడ్డి రామారావు, ఆకుల బాలరాజు, యరకరాజు గోపాలకృష్ణంరాజు, శ్యామలరావు, కడలి వాసు, రైతులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి : కౌలురైతుల సంఘం

ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అస్పష్ట విధానాలతో పంట పండిస్తున్న కౌలు, పేదరైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ధాన్యం కొనుగోలులో కౌలు రైతులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకొల్లు, యలమంచిలి, నరసాపురం మండలాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యంలో తేమశాతం అధికంగా చూపడం, ఆరుదల ఉంటే ముక్కపోతుందంటూ బస్తాకు రూ.60 నుండి రూ.100 వరకు మిల్లర్లు రైతుల నుంచి సొమ్ము కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా తామేమీ చేయలేమని, రైతులే మిల్లర్లతో మాట్లాడుకోవాలని చెప్పడం దారుణమన్నారు. తక్షణం జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని మిల్లర్ల దోపిడీ అరికట్టాలని, అన్నిరకాల ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు గంగాజలం, ఇబ్బా రామకృష్ణ, పంపన రాంబాబు, కడలి పాపారావు, మామిడిశెట్టి విష్ణుమూర్తి, చింతపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు..!

తహశీల్దార్ సాక్షిగా పేదల లంక భూముల నుంచి దౌర్జన్యంగా మట్టి తరలింపు - అడ్డుకోబోయిన లబ్ధిదారుల అరెస్టు

పేదలను, నేతలను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడలో 30 ఏళ్లుగా ఎస్‌సి, బిసి పేదల అధీనంలో ఉన్న పెరుగులంక భూముల్లో మట్టిని హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తహశీల్దార్ సాక్షిగా అధికారులు తవ్వించి తరలించారు. తమ స్వాధీనంలో ఉన్న భూముల్లో మట్టి తవ్వొద్దని, హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి.. మా పొట్ట కొట్టొద్దు అని వేడుకుంటూ అడ్డుకోబోయిన పేదలపైకి పోలీసులను పంపి అరెస్టు చేయించారు. ఇదీ చించినాడ పరిధిలో ఏనుగువానిలంక పెరుగు భూముల వద్ద శనివారం చోటుచేసుకున్న పరిణామాలు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెరుగులంక భూములను ఆ ప్రాంత దళిత, బిసి పేదలు సుమారు 30 ఏళ్లుగా అనుభవిస్తున్నారు. వీరికి పట్టాలు సైతం ఉన్నాయి. ఇటీవల కొంతకాలం నుంచి ఆ భూముల్లో మట్టిని తవ్వి తరలించాలని అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. దీనిపై పేదల పొట్టకొట్టొద్దని ఆ ప్రాంత ప్రజలు, లబ్ధిదారులు సిపిఎం ఆధ్వర్యాన అధికారులకు వినతిపత్రాలు అందించి వివిధ రూపాల్లో ఆందోళనలు సైతం చేశారు. అయితే అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు సైతం స్టే ఇచ్చింది. అయితే శనివారం పెద్దసంఖ్యలో పోలీసు బలగాలను మొహరించి తహశీల్దార్ నరసింహరావు ఆధ్వర్యాన భూముల్లోకి ప్రవేశించారు. ఇక్కడ మట్టి తవ్వకూడదని, దీనిపై హైకోర్టు స్టే ఉందని చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. దీనికి సంబంధించిన పెట్టిన బోర్డును సైతం పెకిలించి పడేశారు. తహశీల్దార్‌గారూ మా పొట్ట కొట్టొద్దు.. హైకోర్టు ఆదేశాలు పాటించండి అని పేదలు విన్నవిస్తున్నా పట్టించుకోకుండా పేదలను, నేతలను బలవంతంగా పక్కకు ఈడ్చేసి భూముల్లో మట్టి తవ్వకం ప్రారంభించారు. ఈ క్రమంలో లంకల సొసైటీ ప్రెసిడెంట్ గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, కానేటి బాలరాజు, చెల్లుబోయిన వడ్డీ కాసులు, ముమ్మిడివరపు ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు, తెన్నేటి స్టాలిన్, కేతా రాము, కేతా వాసులతో సహా సుమారు 20 మంది లబ్ధిదారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి సుదూర ప్రాంతంలో ఉన్న తణుకు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ నుంచి సాయంత్రం సమయంలో వారిని నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలించారు.

తణుకు రూరల్ స్టేషన్‌లో పేదలు, నేతలు

నరసాపురంలో నిరసన

పేదలకు, నేతలకు సిపిఎం పరామర్శ

తణుకు రూరల్: ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేదల ఆధీనంలో ఉన్న చించినాడ లంక భూముల్లో మట్టి తవ్వకాలను అడ్డుకున్న నేతలను, పేదలను అరెస్టు చేసిన పోలీసులు వారిని తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, పివి ప్రతాప్, నేత గార రంగారావు పరామర్శించారు. సాయంత్రం సమయంలో వారిని తణుకు రూరల్ పోలీసు స్టేషన్ నుంచి చించినాడ తరలించారు.

దౌర్జన్యంగా లంక భూముల తవ్వకం అన్యాయం: సిపిఎం

భీమవరం: యలమంచిలి మండలం చించినాడలో పేదల భుక్తంలో ఉన్న గోదావరి పెరుగులంక భూముల్లో ప్రభుత్వం అక్రమంగా కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించి దౌర్జన్యంగా తవ్వకాలకు పూనుకోవడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతియుతంగా నిరసన తెలపాలని ప్రయత్నిస్తున్న పేదలు, అండగా నిలబడ్డ సిపిఎం నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని, అరెస్టులను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఒకవైపు పేదల ప్రభుత్వమని చెప్పుకుంటూ ఆ పేదలు, దళితులు, వెనుకబడిన తరగతులకు అన్యాయం చేసేలా ఇసుక దందాకు పాల్పడుతోందని విమర్శించారు. కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించి పేదలపై, మహిళలపై దౌర్జన్యానికి, అరెస్టులకు పూనుకోవడం దారుణమని తెలిపారు. పెద్దసంఖ్యలో పోలీసులను మొహరించి భయోత్పాతాన్ని కల్గించడం, బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. పర్యావరణానికి హానికల్గించే పెరుగులంక భూముల్లో తవ్వకాలు, పేదలపై దౌర్జన్యం ఆపాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెత్తందారులు, బడాబాబులు, భూస్వాములు అక్రమంగా అనుభవిస్తున్న లంకభూములు ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి కన్పించడం లేదా అని ప్రశ్నించారు. వాటి జోలికి పోకుండా పేదలు అనుభవిస్తున్న భూములను నాశనం చేయాలనుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటోగా జోక్యం చేసుకోవాలని, నిబంధనలను, పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని ఆందోళనలు

యలమంచిలి: లంక భూముల్లో మట్టి తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం చేసిన పేదల అరెస్టును ఖండిస్తూ, వారిని వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం చించినాడలో జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్న లంక భూముల్లో అధికారులు దౌర్జన్యంగా మట్టిని తరలించడం దారుణమన్నారు. ఇదేమని అడిగితే 20 మందిని అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, మట్టి తవ్వకాలను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కౌరు పెద్దిరాజు, కేతా సూర్యారావు, జిల్లెళ్ల ప్రశాంతి, ప్రియాంక, ఎస్.నాగమణి, వై.రమేష్, ఎం.పుల్లారావు, వి.సన్ని, జి.సత్యనారాయణ, ఎ.శ్రీను పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీ పూడికకు లక్షలాది రూపాయలు కేటాయిస్తున్నా చించినాడ పేదల భూముల్లోనే ఇసుక తవ్వకాలకు కాంట్రాక్టర్లకు అధికారులు అనుమతిచ్చి ఎందుకు వారి కొమ్ముకాస్తున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రశ్నించారు. శనివారం చించినాడ పెరుగులంక భూముల్లో ఇసుక తవ్వకాలను అడ్డగించిన 20 మంది నాయకులను, పేదలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు

ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గోదావరికి ఆనుకుని అనేక వందల ఎకరాలు పెరుగులంక భూమి ఉన్నప్పటికీ కక్షపూరితంగా చించినాడలో పేదల స్వాధీనంలో ఉన్న భూమిలో మట్టి తవ్వకం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ ఎటువంటి మట్టి తవ్వకాలు జరపకూడదని హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ పోలీసులను మొహరించి పేదలను బలవంతంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు ఇప్పటికైనా అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, లేనిపక్షంలో అన్ని ప్రజాసంఘాలతో కలిసి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బల్ల చినవీరభద్రరావు, కండెల్లి సోమరాజు, జె.వెంకటలక్ష్మి, ఎస్.అసిరియ్యా, పొన్నాడ రాము, యడ్ల మోహన్‌రావు, షేక్ పాదుషా పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతల్లో కలవరం

ప్రజాశక్తి - పాలకొల్లు

వాతావరణంలో శనివారం మధ్యాహ్నం అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై మబ్బులు, ఉరుములతో వర్షం కురిసింది. ఉదయం ఎండ ప్రభావం ఎక్కువగా ఉన్నా మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడింది. దీంతో జనం వేసవి వేడిమి నుంచి ఉపశమనం పొందారు. అయితే రబీ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న దశలో వర్షం ఎక్కువైతే ధాన్యం తడిచి రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెనుగొండ: అకాల వర్షాలు రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ధాన్యం రోడ్లపై ఆరబెట్టి, రాశులుగా ఉన్న తరుణంలో వర్షాల వల్ల నష్టపోతామని రైతులు వాపోతున్నారు. మండలంలో పలుచోట్ల వర్షం కురిసింది.

మొగల్తూరు: వాతావరణంలో అకాల మార్పులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దాళ్వా వరి మాసూళ్లను అన్నదాతలు ముమ్మరంగా చేస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలకు ధాన్యం దెబ్బతింది. వాటిని ఒబ్బిడి చేసి కనీసం పెట్టుబడులునైనా దక్కించుకుందామనుకున్న రైతుల ఆశలపై వాతావరణ మార్పులు నీళ్లు చల్లుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి : కలెక్టర్


ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

రైతులకు ఇబ్బంది లేనివిధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో ఉండిలోని రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేటి వరకు ఎంతమంది రైతులొచ్చారు, ఎంత ధాన్యం కొనుగోలు చేశారని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బికెలో ఉన్న రిజిస్టర్లను, స్టాక్‌ను పరిశీలించారు. తేమ శాతం లెక్కించే మిషన్, కాటా తదితరాలను పరిశీలించారు. రైతుభరోసా కేంద్రం నుండి ఎటువంటి ఫిర్యాదూ రాకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సకాలంలో గోనె సంచులు అందజేయాలన్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహశీల్దార్ స్వామినాయుడు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నినదిస్తున్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ శివశంకర్

కలెక్టరేట్ వద్ద సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమవుతామని ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ ఎస్.శివశంకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎపి జెఎసి అమరావతి నాయకత్వంలో రెండో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసారు. రెండో విడతలో నియమితులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ వెంటనే డిక్లేర్ జారీ చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రెసిడెంట్ జి.జేమ్స్, జెఎసి అమరావతి జిల్లా కార్యదర్శి ఫణి, ఎపిఆర్‌ఎస్‌ఎ జిల్లా కార్యదర్శి ప్రసాదరాజు, కలెక్టరేట్ సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, సిబ్బంది బుజ్జియ్య, సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగ నాయకులు రమేష్, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి: ఐలు

తాడేపల్లిగూడెం: న్యాయవాదుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయ జిల్లాల కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. ఐలు జిల్లా కమిటీ సమావేశం శనివారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ హాలులో వి.శైలజ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై దాడులు, హత్యలు పెరిగాయన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులకు ఎటువంటి రక్షణా లేకుండా పోయిందన్నారు. రాజస్థాన్ ప్రభుత్వం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్టు తీసుకొచ్చిందని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు సంవత్సరానికి రూ.పది వేలు చొప్పున ఉపకార వేతనం ఐదు సంవత్సరాలు ఇవ్వాలన్నారు. న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది నియామకాలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు, మహిళా న్యాయవాదులకు విశ్రాంతి భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.వేణుగోపాలచౌదరి, కట్టా సత్యనారాయణ, గెద్దాడ విజయభాస్కర్, కె.వెంకటేశ్వర్లు, పివిపి.లక్ష్మి, కెఎల్.సత్యవతి, పి.రాజారావు, వై.మణికంఠ, పి.వెంకట్ పాల్గొన్నారు.

ఆకివీడు కమిషనర్‌గా కృష్ణమోహన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు కమిషనర్‌గా జి.కృష్ణమోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిడదవోలు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మూడు మాసాలుగా ఆకివీడులో కమిషనర్ స్థానం ఖాళీగా ఉంది. జిల్లా రెవెన్యూ కార్యదర్శి సిహెచ్ తిరుమలరావు డిప్యూటేషన్‌పై అదనపు బాధ్యతలతో తాత్కాలిక ప్రాతిపదికపై వారానికి మూడు రోజులు చొప్పున కొనసాగుతున్నారు. తిరుమలరావు బాధ్యతలను కృష్ణమోహన్‌కు అప్పగించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణమోహన్

జగన్‌కే ప్రజల మద్దతు : జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి - పాలకొల్లు

నియోజకవర్గంలో 72 వేల కుటుంబాలు ఉన్నాయని, వాటిలో 59 వేల కుటుంబాలు ఇటీవల నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో జగన్‌కు మద్దతిచ్చారని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. ఆయన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తాము ఊహించిన దానికన్నా పాలకొల్లులో గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ప్రతి పక్షాలు, కొన్ని పచ్చ మీడియా సంస్థలు జగన్‌ను విమర్శిస్తున్నాయని ప్రజల్లో జగన్ పట్ల విశ్వసం ఏ మాత్రం తగ్గలేదని చెప్పారు. జెసిఎ కన్వీనర్లు మద్దాల వాసు, వెంకట రత్నం, భాస్కరరావు, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజు మాట్లాడారు.

చంద్రబాబు మాటలు అవాస్తవాలు : ఎంఎల్‌ఎ

భీమవరం రూరల్:చంద్రబాబు నాయుడు మాటలన్నీ అబద్ధాలని, ఆయన కుయుక్తులను ప్రజలు గమనిస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం జివిఆర్ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగనన్న నినాదం మారుమోగుతోందన్నారు. రాష్ట్రంలో 1.45 కోటి కుటుంబాలు, 1.40 కోటి మిస్డ్‌కాల్స్ రాగా, భీమవరంలో 88,618 గృహాలను సందర్శించగా 71,411 మిస్డ్ కాల్స్ వచ్చాయని తెలిపారు. మెగా సర్వే ఫలితాలు ప్రకటించడానికి గర్వపడుతున్నానని, పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహించారని తెలిపారు. అబద్ధాలతో అధికారంలోకి రావాలని చూస్తున్న చంద్రబాబు కుయుక్తులను గమనించిన ప్రజలు బైబై బాబు అంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్లు తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

ఉండి:బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని యుటిఎఫ్ మండల మాజీ అధ్యక్షులు, పాందువ్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిఎస్ఎన్.రాజు పిలుపునిచ్చారు. శనివారం పాందువ్వలో ఉపాధ్యాయులు ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలన్నారు. పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి పుట్టినరోజునూ గత సంవత్సరం నుండి ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా చేయడంతో విద్యార్థులకు పాఠశాలలపై ఆసక్తి కలుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందం గ్రామంలో ప్రతిఇంటికీ వెళ్లి ఆటోలో మైక్ ద్వారా, కరపత్రాల రూపంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగిస్తున్న ఉపాధ్యాయ బృందానికి దాతలు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

ఐరన్ మాత్రలు వేసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు ఐరన్ మాత్రలు వారానికి ఒకటి చొప్పున వేసుకోవాలని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు. శనివారం కాశిపాడు ఎంపిపి పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్తిక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గడం వల్ల కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనపడతాయన్నారు. ఐరన్‌లోపిస్తే కళ్లు నాలుక, గోళ్లు, అరచేతులు పాలిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో. పాఠశాల హెచ్‌ఎంలు మంజుల.రంగనాయకులు, ఉపాధ్యాయులు పార్వతి, సిహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

శారదాదేవి మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఆచంట

మృత్యుంజయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్స్ వైట్ల శారదాదేవి మృతి సొసైటీకి తీరనిలోటని సొసైటీ కార్యదర్శి పారుపల్లి ఏసురత్నం అన్నారు. శనివారం సొసైటీ కార్యాలయంలో పర్సన్స్ పిచ్చెట్టి సత్యనారాయణ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ సొసైటీకి రెండు సంవత్సరాలపాటు సేవలందించి అందరిమన్ననలను పొందారన్నారు. ఈ కార్యక్రమంలో పర్సన్స్ మొండే శ్రీనివాస్, రాంబాబు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కిషోర్‌కుమార్‌కు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఆచంట

ది మృత్యుంజయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్ వైట్ల శారదాదేవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సంఘటన విదితమే. శనివారం ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నియోజకవర్గ పరిశీలకులు మేడపాటి షర్మిల తదితరులు వైట్ల కిషోర్ కుమార్‌ను పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ ఆమె అకాల మృతి పార్టీకి తీరనిలోటని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, దేవస్థానం ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, కుక్కల కిరణ్, అగినెల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

బాధితులకు సాయం

ప్రజాశక్తి - ఆచంట

ఇటీవల ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పెద్దపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో కొండేటి మునియయ్యకు చెందిన తాటాకిల్లు అగ్నికి ఆహుతవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. దీంతో ఆదే గ్రామానికి చెందిన దాత ఆకుమర్తి రామారావు బాధిత కుటుంబానికి రూ.10 వేలు, రూ.25 కేజీల బియ్యం, దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పారుణ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇంటర్ ఫలితాల్లో పాలకోడేరు మండల కోపరేటివ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వేటుకూరి పద్మావతి తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాలలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపిహెచ్ డబ్ల్యూ (ఎఫ్)లో పి.నవ్య 947, ఆర్.మౌనిక 886 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపిహెచ్ ప్రసన్నలాల 863, ప్రవల్లిక 809, సిఇసిలో శాంతిప్రియ 741, శ్యామల 720 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ కె.విశ్వనాధరాజు, సెక్రటరీ కెఎస్ఆర్. గాంధీరాజు, అధ్యాపకులు అభినందించారు.

సొంత భవనాల్లో ఆర్‌బికెలు నిర్వహించేలా చూడాలి

ఉండి:సొంత భవనాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడి.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం ఉండి రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన వెంకటేశ్వరరావు మాట్లాడారు. మండలంలో ఎన్ని రైతు భరోసా కేంద్రాలున్నాయి, ప్రభుత్వ భవనాల్లో ఎన్ని ఉన్నాయనే దానిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బి.సంధ్య మాట్లాడుతూ ఉండిలో రెండు రైతు భరోసా కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నామన్నారు. సంవత్సరం నుండి అద్దె చెల్లించలేకపోతున్నామని వారు భవనాన్ని ఖాళీ చేయమని చెప్పారని వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. తహశీల్దార్ కార్యాలయం పక్కనే రెండు సంవత్సరాల క్రితం ప్రారంభోత్సవం చేసుకున్న రైతు భరోసా కేంద్రం ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మండల పరిషత్తు నిధులు సమకూర్చాలని మండల వ్యవసాయ అధికారి ఎంపిపి శ్రీరామ నారాయణరాజుకు కోరినట్లు తెలిపారు. అనంతరం ఉండి గ్రామ వ్యవసాయ రైతు భరోసా కేంద్రం పూర్తి చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

విసి దంపతుల కారుకు ప్రమాదం

నిద్రమత్తులో చెట్టును ఢీకొట్టిన డ్రైవర్

భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ దంపతుల కారు శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో భార్య అక్కడికక్కడే మృతిచెందింది. విసి, డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ఉంగుటూరు మండలం చేబ్రోలు వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన తోలేటి జానకీరామ్ పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి (విసి)గా పనిచేస్తున్నారు. ఆయన భార్య ఉషశ్రీ(54)తో కలిసి తాడేపల్లిగూడెంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కడప జిల్లా అనంతరాజుపేటలో శుక్రవారం జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమానికి భార్యభర్తలిద్దరూ కారులో డ్రైవర్‌ను తీసుకుని బయలుదేరారు. అక్కడ కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం తాడేపల్లిగూడేనికి తిరిగి పయనమయ్యారు. అర్ధరాత్రి సమయంలో చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన చెట్టును డ్రైవర్ అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఉషశ్రీ, జానకీరామ్, కారుడ్రైవర్ శ్రీనుప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని కారులో నుంచి బయటకు తీసి 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉషశ్రీ పరిస్థితి విషమంగా ఉండటతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతిచెందారు. జానకీరామ్, అతని కారు డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం అనంతరం ఉషశ్రీ మృతదేహాన్ని స్వస్థలం గుంటూరుకు తరలించారు. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు


ఉషశ్రీ(ఫైల్‌ఫొటో)

వచ్చే నెలలో కుమారుడి వివాహం.. అంతలోనే విషాదం

వైస్‌ఛాన్సలర్ జానకీరామ్ కుమారుడి వివాహం వచ్చేనెలలో జరగనుంది. ఈ తరుణంలో అనుకోని ప్రమాదం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పలువురు మంత్రులు, అధికారులు విసిని ఆసుపత్రిలో పరామర్శించారు.

జెఇఇ మెయిన్స్‌లో తిరుమల విజయభేరి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జెఇఇ మెయిన్స్‌లో భీమవరం తిరుమల విద్యార్థులు విజయభేరి మోగించారని తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు తెలిపారు. శనివారం కళాశాలలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు ప్రోత్సాహంతో విద్యార్థులు ఈ ఘనత సాధించారన్నారు. 216వ ర్యాంకుతో వి.జుహిత రాధ ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎన్.వివేక్ 228వ ర్యాంకు, ఎల్ఆర్.వెంకసాయి 284వ ర్యాంకు, పి.మనోజ్‌కుమార్ 349వ ర్యాంకు, బి.హర్షచందర్ 455వ ర్యాంకు, జిఎస్ఎం.ప్రణవి 678 వర్యాంకు సాధించినట్లు తెలిపారు. 1161వ ర్యాంకు కె.ఉదయామ్, 1184వ ర్యాంకు పి.నవ్యశ్రీ, 1280వ ర్యాంకు సిహెచ్.రోహిత్ సత్య మణికంఠ, 1284వ ర్యాంకు డిపిఎస్. రమ్యలక్ష్మి, 1342వ ర్యాంకు కెఎస్‌వి.శివసాయికష్ణ, 1386వ ర్యాంకు వి.పృథ్విరాజు, 1789వ ర్యాంకు పిబి.వెంకటఫణి, 1794వ ర్యాంకు ఎన్‌వై.శ్రీరమ్య సాధించారని తెలిపారు. ఆల్ ఇండియాలో 500లోపు ర్యాంకు సాధించిన వారు ఐదుగురు, 1500లోపు 12 మంది, 3000లోపు 16 మంది, 5000లోపు 23 మంది, 10000 లోపు 37 మంది, 20000లోపు 83 మంది, 25 వేల లోపు 97 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు మాట్లాడుతూ సుమారు 92 మందికి పైగా విద్యార్థులు కేవలం భీమవరం బ్రాంచి నుండే ఎన్ఐటి, ఐఐటి కళాశాలలో అడ్మిషన్లు సాధిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ సాయిరాజు, శ్రీనివాస వర్మ, సతీష్‌బాబు

జెఇఇ మెయిన్స్‌లో ఆదిత్య విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ యాజమాన్యం

ప్రజాశక్తి - పాలకొల్లు

జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పాలకొల్లు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కప్పల అభిషేక్ వరమ్ 99.24920 పర్సంటైల్, కారుమూరి సుమశ్రీ 98.97 పర్సంటైల్, దొంగ రవికృష్ణ 98.60 పర్సంటైల్, ఏలూరి లక్ష్మి అమృత 98.49 పర్సంటైల్ సాధించారని తెలిపారు. అద్దేపల్లి హారిక 98.29, కడలి లక్ష్మీదుర్గ 96,22, పెనుగొండ సుధీష్ట 98.17, ములుగుర్తి పావని 97.11 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 95 శాతం పైగా పర్సంటైల్ సాధించిన విద్యార్థులు 31 మంది అని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందాన్ని విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎఎజి.వాసుబాబు అభినందించారు.

మేడేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిఐటియు ఆధ్వర్యంలో జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక చుక్కా అప్పల స్వామి భవనంలోని అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సమావేశం నిర్ణయాలను పత్రికలకు విడుదల చేశారు. మేడే రోజున ఉదయం కార్మికుల పని ప్రాంతాల్లో, నివాస ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగుర వేసి, అనంతరం టుటౌన్‌లోని ఎస్‌కె గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఉద్యోగ కార్మిక సంఘాలు నాయకులు ప్రసంగిస్తారని వివరించారు. సభ అనంతరం పట్టణంలో కార్మిక, ఉద్యోగులతో భారీ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీనివాసు పాల్గొన్నారు.

గణపవరం : మే 1న గణపవరంలో జరిగే ప్రదర్శన బహిరంగ సభల్లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడే రోజు ఉదయం ఎనిమిది గంటలకు సిఐటియు కార్యాలయం నుంచి ప్రదర్శన ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రదర్శనలో కార్మికులు, అంగన్వాడీలు, డ్వాక్రా యానిమేటర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొనాలని కోరారు.

మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

వైసిపిని ప్రజలే గెలిపిస్తారు : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతిస్తున్న వైసిపిని ప్రజలే గెలిపిస్తారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరం గ్రామంలో వైసిపి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించడంలో అందరి సమిష్టి కృషి ఉందన్నారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలో ఈ నెల 27 నుంచి విజయవంతంగా సాగిందన్నారు. 2024 ఎన్నికల్లో మీ మద్దతు వైసిపికి ఇస్తారా అని అడగ్గా మద్దతిస్తామని ఎక్కువ శాతం మంది ప్రజలు చెప్పారని చెప్పారు. కార్యక్రమంలో కాళ్ల, ఉండి, జెడ్‌పిటిసిలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్థుల కనకదుర్గ మహంకాళి, ఎంపిపిలు పి.శిరీష విశ్వనాథరాజు, ఇందుకూరి హరిబాబు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న ఆలయం కిటకిట

స్వామివారి కళ్యాణోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలోని ప్రముఖ క్షేత్రమైన కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. యాత్రికులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా వైశాఖ శుద్ధ నవమి పూజలు, మత్స గ్రహణం, అంకురార్పణ, ధ్వజారోహణ సేవలు నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. మే 1వ తేదీ సోమవారం స్వామివారి కళ్యాణం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, స్రవంతి దంపతులతో జరుగుతుందన్నారు. మే 2న మల్లెపూలతో విశేష అర్చన, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు, 3న లిల్లీపుష్పాలతో విశేషార్చన, 4న కనకాంబర పుష్పాలతో, 5న రజిత పుష్పాలతో విశేషార్చన, స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. 6న చక్రస్నానం, 7న గులాబీలతో విశేషార్చన నిర్వహిస్తామన్నారు. 13న అఖండ అన్నసమారాధన జరుగుతుందని ఆలయ ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు.

యాత్రికులతో కిటకిటలాడుతున్న వెంకటేశ్వరస్వామి ఆలయం

వెంకట్రామరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత దాట్ల వెంకట్రామరాజుకు బెంగుళూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి ట్రస్టు ద్వారా పేద ప్రజలకు, విద్యార్థులకు ఆర్థిక సహకారం, వేసవిలో చలివేంద్రాలు, మోక్షధామం వివిధ అభివృద్ధి పనులకు గాను ఆయనను డాక్టరేట్ వరించింది. బెంగుళూరులో ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ ఫౌండర్ జినురామశర్మ స్వామీజీ, మాజీ ఎంఎల్‌ఎ కెవి.మనోకరణ్ చేతుల మీదుగా వెంకట్రామరాజు డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ అందుకోవడం పట్ల కాళ్లకూరు గ్రామస్తులు వెంకట్రామరాజును అభినందించారు.

డాక్టరేట్ అందుకుంటున్న వెంకట్రామరాజు

ముందంజలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యామ్‌సుందర్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండడం అభినందనీయమని సమగ్రశిక్ష ఎపిసి పి.శ్యామ్‌సుందర్ అన్నారు. శనివారం జువ్వలపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విద్యకోసం ఖర్చు చేస్తున్న తరుణంలో గ్రామంలోని బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలన్నారు. ఎంఇఒ ఎ.రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, అమ్మఒడి, నాడు-నేడు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. సమగ్రశిక్ష ఎఎంఒ ఎంఎన్.శ్రీమన్నారాయణ ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న పాఠశాల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి మీసాల వెంకటరమణ, ఉపసర్పంచి కరారి లక్ష్మీపతిరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు జి.బెనహార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యరాలు దండు పద్మావతి తెలిపారు. ఇలపర్రు హైస్కూల్లో 10 తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం చదువు పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, పి.వెంకటేశ్వరరావు, తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - ఉండి

గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణానికి ప్రోత్సహించాలని మండల ప్రత్యేక అధికారి వి.రవికుమార్ తెలిపారు. శనివారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గృహ నిర్మాణ శాఖ ఎఇ రామకృష్ణరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో జగనన్న కాలనీలోని ఇళ్ల స్థలాలు మట్టి పూడిక పనులు వేగవంతంగా జరుగుతున్న కారణంగా లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆయన సూచించారు.

రైతుల నష్టానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం

ప్రజాశక్తి - పెనుమంట్ర

అకాల వర్షాల వల్ల రైతాంగం నష్టపోవడానికి ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వైసిపి గొప్పలు చెబుతోందని, ఆచరణలో శూన్యమని విమర్శించారు. సబ్సిడీతో కూడిన బరకాలు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బరకాలకు భారీగా వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ ఛార్జీ కింద రూ.25 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారని తెలిపారు. భవనాలు, పరికరాలు అంటూ అత్యవసరం కాని వాటికి ప్రాధాన్యతిచ్చి రైతులకు ఎంతో ఉపయోగపడే బరకాల విషయంలో నిర్లక్ష్యం చేయడం తగదని తెలిపారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడంతోపాటు సబ్సిడీతో కూడిన బరకాలు అందించాలని డిమాండ్ చేశారు.

సోమాలమ్మ సన్నిధిలో ఎంఎల్‌ఎ రామరాజు

పాలకోడేరు:పాలకోడేరు ఎఎస్ఆర్‌నగర్‌లో సోమాలమ్మ అమ్మవారి 34వ వార్షిక జాతర మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖండ అన్నసమారాధనలో ఎంఎల్‌ఎ రామరాజు పాల్గొన్నారు.

కోడిపందాల స్థావరంపై దాడి

ఉండి:అర్తమూరు గ్రామంలోని కోడి పందేల స్థావరాలపై ఉండి పోలీసులు శనివారం దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 6100 రూపాయల నగదు, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గంగాధర్‌రావు తెలిపారు.

కంటి పరీక్షలు త్వరతగతిన పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

కంటి వెలుగు స్క్రీనింగ్ పరీక్షలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మూడో విడత కంటి వెలుగు కార్యక్రమంపై వైద్య శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 60 ఏళ్ల వయసు పైబడిన 88,638 మందికి మూడో విడత కంటి వెలుగు కార్యక్రమం కింద స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాల్సి ఉందన్నారు. ఇప్పటివరకూ 22,248 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2,01,578 మందికి కంటి పరీక్షలు చేయాలని లక్ష్యం తీసుకోగా తొలి రెండు విడతల్లో 1,12,940 మందికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేసి, అవసరమైన 34,064 మందికి కంటి అద్దాలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే 3,558 మందికి శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు. నరసాపురం, పాలకొల్లు మండలాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్రచికిత్సలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కంటి వెలుగు డిపిఎం డాక్టర్ ఎస్.చందన ప్రియ, తణుకు హాస్పిటల్ సూపరింటెండెంట్ శివప్రసాద్, భీమవరం, తణుకు పిఎంఒలు ఎంఆర్‌కె.రాజు, రమేష్ పాల్గొన్నారు.

5 నుంచి పొలమూరులో వేసవి వినోదం

ప్రజాశక్తి - పెనుమంట్ర

డివైఎఫ్ఐ, ఐద్వా సహకారంతో పొలమూరులో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలిదిండి సూర్యనారాయణరాజు జన విజ్ఞాన కళావేదిక వద్ద మే ఐదో తేదీ నుంచి 15వ తేదీ వరకు వేసవి వినోదం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ చింతపల్లి మావో తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పొలమూరు జిల్లా పరిషత్ హైస్కూల్ అవరణలో ప్రధానోపాధ్యాయులు బండి ఆంజనేయులు చేతుల మీదుగా కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మావో మాట్లాడుతూ బడి పిల్లలకు వేసవి సెలవుల్లో విజ్ఞానం, వినోదం కూడిన కృత్యాలతో వేసవి వినోదం కార్యక్రమం జన విజ్ఞాన వేదిక రూపొందించిందన్నారు. గత విద్యా సంవత్సరం ఆలస్యంగా ప్రారంభం కావడం, అంతులేని సిలబస్, అర్థం లేని పరీక్షా విధానాల వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యారన్నారు. స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడి విద్యార్థుల్లో సృజనాత్మకత తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి వేసవి వినోదం పేరిట పిల్లల్లోని అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసేలా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది నుండి 14 సంవత్సరాల వయస్సున్న బాలబాలికలు ఈ కార్యక్రమానికి అర్హులని, ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం, ఓరిగామి, గణితంలో మెళకువలు, సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్, మట్టి బొమ్మల తయారీ వంటివి నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ప్రమోద్, భరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎఒగా జోష్న్యల

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారిగా ఎం.జ్యోష్న్యల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నరసాపురం ఎఇఒగా పనిచేస్తూ ఇక్కడ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎఒగా పనిచేసిన మద్దాల జయ దుర్గామాధురి గుంటూరు కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

సోషల్ ఆడిట్ పై పేరెంట్స్‌కు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు జివిఎస్‌విఆర్‌ఎం పాఠశాలలో ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి పేరెంట్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల నిధుల వినియోగంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పేటట్లు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించాలని, ప్రతి ఒక్క పేరెంట్ మొక్కలు నాటాలని, పాఠశాల అభివృద్ధిలో తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రిమూర్తులు, శశికళ, చంద్రకళ, బొక్క భవాని దుర్గ పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక యువజన రాష్ట్ర అధ్యక్షుడిగా సూర్యభాస్కరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా మార్టేరుకు చెందిన అల్లాడ సూర్య భాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాతీయ చేనేత ఐక్యవేదిక కార్యవర్గ సమావేశం శనివారం తిరుపతిలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు సుంకర రెడ్డిబాబు సూర్యభాస్కరరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కర్‌రావు మాట్లాడుతూ చేనేత కార్మికుల అభ్యున్నతికి పురోగతికి పాటు పడతానన్నారు. చేనేత జాతికి వృత్తి పరమైన గౌరవంతో పాటు ప్రభుత్వపరమైన ప్రోత్సాహకాలు కల్పించడమే కాకుండా రాయితీలు ఫలాలు అందేలా చూడడమే లక్ష్యమన్నారు.

టిడిపి విశ్వబ్రాహ్మణ నియోజకవర్గ కన్వీనర్‌గా పాండురంగారావు

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి విశ్వబ్రాహ్మణ నరసాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా మొగల్తూరుకు చెందిన చింతాజు పాండురంగారావు నియమితులయ్యారు. విజయవాడలో ఈ నెల 28న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన బిసి సాధికార సమావేశంలో పాండురంగారావును నరసాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి నాయకులు ఆయనను అభినందించారు.